నిత్యం ప్రజల కోసమే పనిచేస్తా

- నియోజకవర్గాలు మార్చే రాజకీయ వ్యాపారిని కాదు
- పరిపాలన రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు గుమ్మడి కాయలతో హారతిస్తున్న మహిళలు



వృద్ధునికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మేయర్ హరివెంకటకుమారి

కొమ్మాది: తానెప్పుడూ ప్రజలతోనే ఉంటానని, ప్రజల కోసమే పనిచేస్తానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, ముబారక్ కాలనీ ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా సాగర్‌నగర్‌లో గల మోగదారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారంలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున గుమ్మడి కాయలతో హారతి పట్టి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల నుంచి నిత్యం ప్రజల్లోనే ఉన్నానని, ప్రజలకు ఏం కావాలో, ఎలా కావాలో తెలుసుకుని సమస్యలు పరిష్కరించామన్నారు. ఐదేళ్లు సంక్షేమ పాలనతోపాటు, అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడెక్కడో నియోజకవర్గాలు మారి, పార్టీలు మారి వ్యాపారాల కోసం మీ దగ్గరకు వస్తారని, వారి ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. పిలిచిన వెంటనే పలికే వ్యక్తి కావాలో, లేక ఎన్నికలు అయిపోయిన వెంటనే కనిపించకుండా పోయే వ్యక్తి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలన రాజధానిగా అభివృద్ధి చెందుతుందని, ఫలితంగా నగరానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సీఎం జగన్ గెలిస్తే ప్రజలు గెలిచినట్లు, అభివృద్ధి గెలిచినట్లు, సంక్షేమం గెలిచినట్లు అన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధి చేశారని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ సేవ చేసే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని, ఓటు వేసే ముందు మన ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యంగా విశాఖను ఐటీ హబ్‌గా, పర్యాటకంగా, సుందరంగా తీర్చిదిద్దారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, దాసు, ముదుండి రాజేశ్వరి, అల్లాడ ఉమా మహేశ్వరరావు, నొడగల రాంబాబు, కోన సింహాచలం, అప్పలరాజు, దువ్విదాసు, మాదు చంటి పాల్గొన్నారు.



మోగదారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమిలిలో మొత్తం 32 నామినేషన్ల దాఖలు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసేందుకు స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 25 వరకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ప్రక్రియకు గురువారం ఆఖరు రోజు కావడంతో ఆరుగురు నామినేషన్లు వేశారు. టీడీపీ తరపున గంటా శ్రీనివాసరావు, గంటా రవితేజ రెండు నామినేషన్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి సమక్షంలో దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మేక సత్యకిరణ్, నూకల సూర్యప్రకాశ్ నామినేషన్లు దాఖలు చేశారు. కోల హరిబాబు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున, జాతీయ జనసేన పార్టీ తరపున గంటా శ్రీనివాసరావు అనే వ్యక్తి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం దాఖలైన 32 నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ తరపున ఆరు సెట్ల నామినేషన్లు, టీడీపీ తరపున ఏడు సెట్లు, జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున మూడు సెట్లు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ తరపున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రజా ప్రస్థానం పార్టీ తరపున ఒకరు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఒకరు, జాతీయ జనసేన పార్టీ తరపున ఒకరు, తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

మూడు రెట్లు పెరిగిన నామినేషన్లు

తగరపువలస: భీమిలి నియోజకవర్గానికి సంబంధించి 2019 ఎన్నికల్లో 11 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం లభించగా చివరకు పోటీలో పది మంది తలపడ్డారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికలకు సంబంధించి చివరి రోజైన గురువారం నాటికి మొత్తం 32 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో వైఎస్సార్‌సీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు 4, ఆయన సతీమణి 2 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి గంటా శ్రీనివాసరావు 4, ఆయన కుమారుడు రవితేజ 3 సెట్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అడ్డాల వెంకట వర్మరాజు 2, ఆయన సతీమణి స్వప్న ఒక సెట్ నామినేషన్ వేశారు.

బీఎస్పీ నుంచి భాగం గోపాల్ 2, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి ఇల్లిపిల్లి అనిల్ కుమార్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి దాసరి లక్ష్మి సంధ్య, సమాజ్‌వాదీ పార్టీ నుంచి చోడిపల్లి రాజు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కోల హరిబాబు, జాతీయ జనసేన పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు ఒక్కో సెట్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నాగోతు నాగమణి, బుగత రాము, నందికోళ్ల సంధ్య, చొప్పల్లి శరవన్ గణేష్, బావిశెట్టి రమణబాబు, ఏలూరు ధర్మావతి, మేకా సత్యకిరణ్ ఒక్కో నామినేషన్ వేయగా నొక్కల సూర్యప్రకాష్ 2 సెట్లు దాఖలు వేశారు.

జాగ్రత్తలతో మలేరియాను నిర్మూలిద్దాం

కొమ్మాది: దోమల నివారణ పద్ధతులు పాటిస్తూ మలేరియాను తరిమికొట్టాలని జీవీఎంసీ 4వ వార్డు మలేరియా నియంత్రణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు పిలుపునిచ్చారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు చేపలుప్పాడలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, సిమెంట్ ట్యాంకులు, వాడని నీటి బావులు, లోతట్టు ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. వారానికి ఒక్కసారైనా దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేపాకు పొగ వంటివి వాడాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.



చేపలుప్పాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థినికి రూ.10 వేల సాయం



రిషితకు నగదు అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలికి చెందిన మైలిపల్లి రిషిత పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించినందుకు స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు గురువారం నగదు బహుమతి అందించారు. మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలిపల్లి లక్ష్మణరావు, రాజేశ్వరి దంపతుల కుమార్తె మైలిపల్లి రిషిత సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్‌లో పదో తరగతి చదివింది. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ఈమె 600 మార్కులకు 595 సాధించింది. దీంతో ఫ్యాబ్ సభ్యులు ఆమెకు రూ.10 వేల నగదు అందించారు. ప్రతినిధులు కాళ్ల సన్నీ, ఎం.సూర్య శ్రీనివాస్, మారోజు గోపి, పెంటపల్లి దేవానంద్, విజ్జపు సత్యనారాయణ, కట్టమూరి అశోక్, రిషిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా మండలంలోని అన్నవరం, మూలకుద్దు, పెద నాగమయ్యపాలెం, అమనాం, చిప్పాడ, గుడివాడ పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పద్మనాభం: పద్మనాభం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రేవిడి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, కురపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి గాయాలు



బాధితులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో గురువారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఏడుగురిని, ఒక ఆవును గాయపరిచింది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నిద్రిస్తున్న సమయంలో ఇళ్లలోకి ప్రవేశించిన కుక్క... పి.కుమారి (37), రౌతు రమణమ్మ (59), గాడు శ్రీను (45), అలుగోలు కనక బ్రహ్మం (58), హర్ష (7), మహంతి సీతమ్మ (60), మైలపల్లి వర్ణకుమార్(8)ను గాయపరిచింది. వీరిని పద్మనాభం 108 అంబులెన్సులో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు. సారిక రాముకు చెందిన ఆవును గాయపరిచింది.

కళింగాంధ్ర కథా జాడ పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: కళింగాంధ్ర కథా జాడ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గురజాడ నుంచి ఇప్పటి వరకు ఉన్న నాలుగు తరాల కథలు దీనిలో పొందుపరిచారు. కళింగాంధ్ర సామాజిక పరిణామం తెలిపేలా పుస్తకం నిలుస్తుందని వీసీ తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సంపాదకులు అట్టాడ అప్పలనాయుడు, చీకటి దివాకర్, ఏయూ ఆచార్యులు ఎ.సీతారత్నం, జె.విజయభారతి, కె.రాజామాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ ఆధ్వర్యంలో మండపారాధన, గణపతి పూజ, పాలాభిషేకం, ధాన్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. శుక్రవారం విగ్రహం ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు.



సుబ్రహ్మణ్యస్వామిని పాలకుండీలో ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: జీవీఎంసీ 45వ వార్డు సింగాలమ్మ పురానికి చెందిన పలు పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును సీతమ్మధారలోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ముత్తంశెట్టి సమక్షంలో వారంతా పార్టీలో చేరగా... వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా, ముత్తంశెట్టి గెలుపే లక్ష్యంగా బాధ్యతతో పనిచేస్తామని హామీ ఇచ్చి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ నుంచి పోటీ చేస్తున్న గంటా శ్రీనివాసరావు ఏనాడూ ప్రజలకు తన ముఖాన్ని చూపించలేదన్నారు. గంటా పాలన అంతా కబ్జాలమయమని, ఆయన వల్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలే బాగుపడతారన్నారు. సాధారణ ప్రజలకు ప్రయోజనం శూన్యమన్నారు.

కవుల కృషితో సామాజిక రుగ్మతల నిర్మూలన

ఏయూక్యాంపస్: సామాజిక రుగ్మతలను నిర్మూలించే విధంగా ఉత్తరాంధ్ర కవులు కృషి చేశారని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. గురువారం ఏయూలో నిర్వహించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి, సాహిత్యంలో ప్రతిఫలాలు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య సీతారత్నం మాట్లాడుతూ రచనల్లో ఆధునిక భావజాలం అందించి సమత్వ భావజాల ఆవశ్యకతలను మొదటి ఉత్తరాంధ్ర గుర్తించిందన్నారు. విశిష్ట అతిథి రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాహిత్యంలో వచ్చిన వైవిధ్యభరిత సాహిత్య ప్రక్రియలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మీయ అతిథి చీకటి దివాకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సాహిత్యంపై విశ్వవిద్యాలయాలలో మేథో మథనం జరగాలని సూచించారు. విశిష్ట అతిథి ఆచార్య హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ దృష్టి కోణంలో సాహిత్యాన్ని కవులు రాయాలన్నారు. కార్యక్రమానికి ఏయూ హిందీ విభాగం ఆచార్యులు కె.విజయభారతి సహ కన్వీనర్‌గా వ్యవహరించారు. మూడు జిల్లాల నుంచి 120 మంది కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు సిరికి స్వామినాయుడు, పాయల మురళీకృష్ణ, లండ సాంబమూర్తి, గౌరీ శంకర్ శివరాం, ఉపద్రష్ట శర్మ, కూర్మారావు, స్వరాజ్యం రవణమ్మ, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి బాలల నటనా శిక్షణ శిబిరం

ఏయూ క్యాంపస్: నవరస థియేటర్స్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బాల బాలికల నటనా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పి.వి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగసాయి నాటక గ్రంథాలయం సహాయంతో నెల రోజుల శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న రంగసాయి నాటక గ్రంథాలయ ప్రాంగణంలో శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 98484 61959, 86395 07458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్, హేమా వెంకటేశ్వరి, డాక్టర్ కె.వెంకటరావు, బి.కృష్ణమూర్తి, ఎస్.తేజా, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

అందుబాటులో ఉండే ముత్తంశెట్టినే గెలిపించుకుందాం



పద్మనాభంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, తదితరులు



కొమ్మాదిలో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, వైఎస్సార్ సీపీ నాయకులు

కొమ్మాది: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని జీవీఎంసీ 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం కొమ్మాది గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేసిన అభివృద్ధి పనులను గడప గడపకు వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, గుంటుబోయిన శ్రీనివాస్, సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, పైడిరాజు, లొడగల రాఘవ్, పోతిన సూరిబాబు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్, రిక్షా కాలనీ, పాకల కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో పసుపులేటి గోపి, బంగారు ప్రకాష్, బెల్లపు పాపారావు, వంకాయల మారుతీ ప్రసాద్, తమ్మినేని వరలక్ష్మి, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, ఆదిలక్ష్మి, పి.ఎల్లాజీ, సర్పత్ శ్రీను, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, వార్డు మెంబర్లు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. అందరికీ కరపత్రాలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



స్వతంత్రనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేజీహెచ్‌లో ఈ-లైబ్రరీ ప్రారంభం



ఈ-లైబ్రరీని ప్రారంభిస్తున్న వైద్యులు బుచ్చిరాజు, అశోక్‌కుమార్

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రి ఎనస్థీషియా విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ-లైబ్రరీని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ-లైబ్రరీ వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని వారంతా ఉపయోగించుకోవాలని బుచ్చిరాజు, అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి, చీఫ్ డైటీషియన్ హెచ్. వెంకట రమణమూర్తి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మాళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంతో 'ఉక్కు' పరిరక్షణ

అగనంపూడి: ప్రజా ఉద్యమాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1169వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో సవతి ప్రేమ ఒలకబోస్తున్నాయన్నారు. కేంద్రానికి కొమ్ము కాస్తుండడం వల్లే విశాఖ ఉక్కుకు ఈ దుస్థితి కలిగిందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని, ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతితోనే ప్రగతి

ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి

పరవాడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పుడే ప్రగతి సాధ్యపడుతుందని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ సహకారంతో శ్రేయ ఫౌండేషన్ నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళలో అంతర్గతంగా కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు ఉంటాయన్నారు. వాటిని వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించడం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టరు కె.శ్రీకాంత్ మాట్లాడుతూ భార్య భర్తలు కొంత ఆదాయాన్ని పోగు చేసినప్పుడే కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి జీవన ప్రమాణాలు పెరుగుదలకు దోహదపడతాయన్నారు. 6 నెలల పాటు 60 మంది మహిళలకు రెండు బ్యాచ్‌లుగా కుట్టు శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఫౌండేషన్ కృషి చేస్తుందని డాక్టర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రియ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గిరిధర్‌భక్షి

8 మద్యం సీసాలు స్వాధీనం

పీఎం పాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పీఎం పాలెం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొట్టవానిపాలెం కాలనీకి చెందిన టేకుపూడి మంగరాజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకుని 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సిరులతల్లికి ఘనంగా పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.



కనకమహాలక్ష్మి అమ్మవారు